గంజాయి విక్రేత అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 30: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ ఎం రమేశ్ నిందితుడి అరెస్ట్ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని తిలక్‌నగర్ నివాసి తాండ్ర అవినాశ్ హైదరాబాద్‌లో క్యాబ్ నడిపేవాడు. గంజాయి సేవిస్తూ ఇతరులకు విక్రంచేవాడు. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో అడ్డుగుంటపల్లి వద్ద బీరవేని అభిలాష్ అలియాస్ చంటి అన్వర్, చిక్కుడు రాహుల్, తాండ్ర అవినాష్ 1,400గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. అవినాష్ పరారీలో ఉన్నాడు. గత నెల 22న ఒడిశాకు వెళ్లి అక్కడ అన్వర్ అనే పాత నేరస్తుడితో కలిసి 5.5కిలోల గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ క్రమంలో గంజాయిని మహారాష్ట్రలో విక్రయించడానికి వెళ్తుండగా గోదావరిఖనిలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకుని అరెస్ట్ చేశారు. సిబ్బంది భూమయ్య, హిమసుందర్, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్‌కు ఏసీపీ నగదు రివార్డు అందజేసి అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజ్‌కుమార్ ప్రచారం

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 30: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న తెలంగాణ మెడికల్ కౌన్సిలర్ మెంబర్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్‌కుమార్ సోమవారం పెద్దపల్లి జూనియర్ కళాశాల మైదానం లో ప్రచారం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్, వాకర్స్ క్రీడాకారులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యు లు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు ఉన్నారు.

కొలనూర్‌లో ఆటో చోరీ

ఓదెల, సెప్టెంబర్ 30: కొలనూర్ గ్రామంలోని రైల్వేస్టేషన్ కాలనీకి చెందిన గట్టు సదయ్య రోజువారీ మాదిరిగా తన ఆటోను ఆదివారం రాత్రి ఇంటి ఎదుట ఉంచాడు. సోమవారం ఉదయం లేచిచూసేసరికి ఆటో కనిపించకపోవడంతో పొత్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ అశోక్‌రెడ్డి గ్రామంలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆటో చోరీ కావడంతో బాధిత కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.

ఓపెన్ స్కూల్‌తో ఇంటర్ పూర్తి చేసే అవకాశం

ముత్తారం, సెప్టెంబర్ 30: చదువు మానేసిన వారికి పదో తరగతి, ఇంటర్ విద్యను పూర్తి చేసే అవకాశం తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా కల్పిస్తున్నామని అడవిశ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఇరుగురాల ఓదెలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యను పూర్తి చేసే అవకాశం తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా కల్పిస్తుందని తెలిపారు. అడవిశ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఓపెన్ స్కూల్ మంజూరైందని తెలిపారు.

పోస్టింగ్ ఉత్తర్వులు అందజేత

రామగిరి, సెప్టెంబర్ 30: సింగరేణి ఏపీఏ ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న డిపెండెంట్లకు సోమవారం జీఎం కార్యాలయంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. అంకితభావంతో పని చేయాలన్నారు. ఇక్కడ ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారులు సుదర్శనం, రాజేంద్రప్రసాద్, మల్లన్న, క్రాంతికిరణ్ ఉన్నారు.

క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు

ముత్తారం, సెప్టెంబర్ 30: ఓడేడ్ గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర పల్లి పెట్రోల్ పంపు ప్రధాన రహదారి సమీపంలో అర్ధరాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. క్షుద్ర పూజలు చేసిన ప్రదేశంలో కోడిగుడ్లు, నిమ్మకాయలు, కోడిని బలి ఇచ్చిన ఆనవాళ్లతోపాటు పూజా సామగ్రి చిందరవందరగా పడవేసి ఉన్నాయి. దీంతో ప్రధాన రహదారి వెంబడి వెళ్లే వాహనదారులు, గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

కళాజాత బృందం ప్రదర్శన

మంథని రూరల్, సెప్టెంబర్ 30: వెంకటాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి కళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. డ్రంగ్స్, గంజాయి, మద్యం అలవాట్లతో కలిగే నష్టాలపై కళాకారులు అవగాహన కల్పించారు. ఇక్కడ సీఐ రాజు, ఎస్ఐ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

రైతుభరోసా ఎప్పుడు?

- ఇప్పటికీ పూర్తికాని విధివిధానాలు
- మరోవైపు రుణమాఫీ వర్తించక ఇబ్బందులు
- అప్పులు చేస్తున్న అన్నదాతలు
- జిల్లాలో 2.06లక్షల ఎకరాల్లో వానకాలం సాగు

పెద్దపల్లి, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పథకం రైతు భరోసాగా ఎప్పుడు వస్తుందనే ఎదురుచూపులే రాష్ట్ర రైతాంగానికి మిగిలింది. వానాకాలం సీజన్ ముగింపునకు వస్తున్నప్పటికీ నేటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట రెండు సీజన్ లకు ఒక్కో ఎకరానికి రూ. 5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరానికి సీజన్‌కు రూ.7,500 చొప్పున అందజేస్తామని ప్రకటించింది. మంత్రివర్గ ఉపసంఘం కూడా ఏర్పాటు చేసి ప్రత్యేక సదస్సులు నిర్వహించింది. వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు కూడా సేకరించింది. కానీ నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మాత్రం నెరవేర్చకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

సాగు పెట్టుబడి కోసం అప్పులు..

జిల్లాలో 1.55లక్షల మంది రైతులు ఉండగా.. దాదాపు 2.06 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు అంచనా. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసింది. వివిధ కారణాలతో చాలామందికి ఈ రుణమాఫీ వర్తించలేదు. వీటితో పాటు రూ.2 లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులకు సైతం మాఫీ లబ్ధి చేకూరలేదు. రుణాలు మాఫీ కాని రైతులకు బ్యాంకులు తిరిగి రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా రైతులకు రుణాలు దక్కక.. పెట్టుబడి సాయం అందక ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. వడ్డీ చెల్లిస్తూ అప్పులు తీసుకుని పంటల సాగు ప్రారంభించారు. కాగా జిల్లాలో ఇప్పటివరకు మూడు విడతల్లో 51, 393 మంది రైతులకు రూ.375.58 కోట్ల రుణాలు మాఫీ చేశారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వ్యవసాయశాఖ అధికారులతో సర్వే నిర్వహిస్తూ వివరాలు సేకరిస్తోంది. తమ రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని ఇంకా రుణమాఫీ కాని రైతులు కోరుతున్నారు.

ఇంకా ఖరారు కాని విధివిధానాలు..

వర్షాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు మూడు నెలలు పూర్తైనా రైతుభరోసా పేరిట అందించే పెట్టుబడి సాయం పథకానికి సంబంధించి ప్రభుత్వం పూర్తి విధివిధానాలు ప్రకటించలేదు. మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినా పథకం అమలు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.5వేలు ఇస్తారా? లేక రూ.7500లు ఇస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రైతు భరోసాకు కటాఫ్ నిర్ణయిస్తే పరిస్థితి ఏంటనే ఆందోళన సైతం రైతుల్లో ఉంది. కటాఫ్ పెడితే ఎన్ని ఎకరాల వరకు ఉంటుందనే విషయం కూడా తెలియాల్సి ఉంది. అర్హుల వివరాలపై స్పష్టత లేకపోవడంతో రైతుభరోసా పథకం అమలుపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం అర్హులను గుర్తించి రైతు భరోసా పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆదేశాలు అందలేదు..

ప్రభుత్వం పెట్టుబడిసాయం కింద అందించే రైతుభరోసా పథకానికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు ఇంకా అందలేదు. ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు కార్యాచరణ ప్రారంభిస్తాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తాం.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి(పెద్దపల్లి)

పెరగని వేతనాలు.. అందని బిల్లులు

- హామీలు అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్
- లేదంటే ఆందోళన చేపడుతామని హెచ్చరిక

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 30: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తోంది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుండగా, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో గత ఆరేండ్ల నుంచి తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. జిల్లాలోని 525ప్రభుత్వ పాఠశాలల్లో 911మంది మధ్యాహ్న భోజన వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి ప్రతినెలా రూ.3వేల గౌరవ వేతనం ఇస్తుండగా, అందులో కేంద్రం రూ.600, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,400ఇస్తున్నది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.10వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ హామీఇచ్చింది. ఇప్పటికీ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు అవుతున్నా.. జీతాలు పెంచలేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచకపోవడమే కాకుండా ఇవ్వాల్సిన జీతాలు, డైట్ బిల్లులు రాకపోవడంతో ఇటీవల వారు ఆందోళనలు చేపట్టారు. 9, 10వ తరగతి సంబంధించి ఐదు నెలలు (మార్చి, ఏప్రిల్, జూన్,జూలై, ఆగస్టు) డైట్ బిల్లులు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా రాలేదని వాపోతున్నారు. నిధులు రాకపోవడంతో అప్పుచేసి భోజనం పెట్టాల్సిన వస్తోందంటున్నారు. కాగా, ఒక్కో కోడి గుడ్డుకి రూ.5 ప్రభుత్వం చెల్లిస్తుండగా, మార్కెట్‌లో రూ.6.50పైసలు ఉండడంతో నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేలతోపాటు డైట్ బిల్లులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటియూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ డిమాండ్ చేశారు.

టీబీ చాంపియన్ శిక్షణ

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 30: గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం టీబీ అలెర్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా టీబీ చాంపియన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ బారినపడి సరైన మందులు వాడి వ్యాధిని జయించిన వారిని టీబీ చాంపియన్స్‌గా గుర్తించారు. ఈ సందర్భంగా వ్యాధి బారినపడినప్పుడు వారి అనుభవాలను పంచుకున్నారు. ఇక్కడ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్, గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అనుదీప్, హెచ్ఈవో ఎండీ అనిసుద్దీన్, వెంకట్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్, టీబీ అలెర్ట్ ఇండియా ప్రతినిధులు ఉన్నారు.

నాలాలపై నిర్మాణాలు తొలగించాలి

కోల్‌సిటీ, సెప్టెంబర్ 30: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నాలాలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ప్రకటనలో కోరారు. గోదావరిఖని కళ్యాణ్‌నగర్, రమేశ్‌నగర్, అశోక్‌నగర్, సీతానగర్, మేదరిబస్తీ, అడ్డగుంటపల్లి, మార్కండేయ కాలనీ ప్రాంతాల్లో ప్రధాన నాలాపై చేపట్టిన అక్రమ నిర్మాణాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. అలాగే ఎన్టీపీసీలో గల సాయిలీలా రెస్టారెంట్ పూర్తిగా నాలాను ఆక్రమించి కట్టారని, అధికారులు సర్వే చేసి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా కళ్యాణ్‌నగర్, మార్కండేయకాలనీలో అక్రమ నిర్మాణాలు అధికంగా ఉన్నాయని, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అడ్డగుంటపల్లి చెరువులో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు.

జీఎంకు సన్మానం

గోదావరిఖని, సెప్టెంబర్30: రామగుండం ఏరియా-1 రీజియన్ క్వాలిటీ జీఎం కేవీరావు పదవీరమణ పొందగా, సోమవారం ఆర్జీ-1 కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్ పూలమాల వేసి సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, సీఎంఓఏఐ ప్రతినిధి శ్రావణ్, సీనియర్ పీవో హన్మంతరావు ఉన్నారు.

కార్యాలయానికి చేరిన యంత్రం

- 'నమస్తే' కథనానికి స్పందన

ముత్తారం, సెప్టెంబర్ 30: వడ్ల కొనుగోలు కేంద్రంలో ఉన్న ప్యాడీ క్లీనర్ యంత్రాన్ని మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయానికి తరలించారు. 'తుప్పు పడుతున్న తూర్పాల యంత్రం' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు.

అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు సన్మానం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 30: సింగరేణి ఏరియా దవాఖానలో డీఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌కు ఇటీవల అడిషనల్ చీఫ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. సోమవారం ఆయనను సీనియర్ న్యాయవాది వేల్పుల మురళీధర్‌యాదవ్ సన్మానించారు. ఇక్కడ న్యాయవాది ముస్కె రవికుమార్, డాక్టర్ విష్ణుమూర్తి, సూపరింటెండెంట్ మురళి ఉన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఎలిగేడు, సెప్టెంబర్30: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలను డీఈవో మాధవి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆమె సూచించారు. ఇక్కడ ఎంఈవో కవిత, హెచ్ఎం దేవేందర్‌రావు, మాధురి, లక్ష్మణ్, రమేశ్, రవి, ప్రణయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక

మల్లయ్య

రాజ్‌కుమార్

ధర్మారం, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొడారి హనుమాన్, గాండ్ల స్వామి, నార ప్రభాకర్, ముఖ్య సలహాదారుడిగా కొత్త నర్సింహం, అధ్యక్షుడిగా గందం మల్లయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొమిరిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఆకుల రాజేందర్, రాసూరి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా ఆశనవేని రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా నార మహేందర్, సహాయ కార్యదర్శిగా జంగిలి సంతోష్, కోశాధికారిగా నార సురేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రాసూరి రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా ఇమ్మిడిశెట్టి శంకరయ్య, బొలిశెట్టి హరీశ్, కోట సంతోష్, సాన రాజమల్లు, బెల్లాల రమేశ్, మామిడి చందు, ఆకారి లచ్చయ్య, దాసరి శ్రీనివాస్, చేపూరి సత్తయ్య, కోల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు సత్కరించారు.

బాధితుడికి న్యాయం చేయండి

గోదావరిఖని, సెప్టెంబర్ 30: సింగరేణి దళిత కార్మికుడు కోరె శంకర్ మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర నాయకుడు మంద రవికుమార్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గాంధీనగర్‌కు చెందిన మాటేటి కనకరాజు, మాటేటి మౌనిక ఎస్సీ మాదిగ కులం పేరుతో తిట్టి.. చెప్పుతో కొడితే ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన కోరె శంకర్ ఫిటిషన్‌ను సీఐ తీసుకోలేదన్నారు. పైగా మాటేటి మౌనిక ఫిటిషన్‌ను తీసుకోని కేసు నమోదు చేయడంతో అవమానభారంతో శంకర్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఇందుకు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ ప్రధాన బాధ్యులని ఆరోపించారు. వెంటనే సీఐని బదిలీ చేయాలని, శంకర్‌పై దాడిన చేసిన కనకరాజు, మౌనికను అరెస్ట్ చేయాలన్నారు. ఇక్కడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బీ రాజయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్, కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కిష్టయ్య, జిల్లా కోఆర్డినేటర్ ఆకునూరి బాలు అంకుశ్, బత్తుల శంకర్, ఆకునూరి రాజయ్య, దళిత జన చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత పర్వతాలు ఉన్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

ముత్తారం, సెప్టెంబర్ 30: లక్కారం గ్రామంలో గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా పంజాల సాయిల్ గౌడ్ ఎన్నికయ్యారు. సొసైటీ ప్రెసిడెంట్‌గా బత్తిని ధనంజయ్‌ను ఎన్నుకున్నారు. ఇక్కడ సంఘం నాయకులు కుమార్‌స్వామి, తిరుపతి, తిరుపతి ఉన్నారు.

మూన్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడి తన్నీర్ రాజేందర్

ధర్మారం, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలోని గౌతమబుద్ధ ఫంక్షన్‌లో సోమవారం మండల మూన్నూరుకాపు సంఘం ఎన్నికలు జరిగాయి. బ్యాలెట్ తరహాలో ఎన్నిక నిర్వహించగా, తన్నీర్ రాజేందర్, మంద శ్రీనివాస్, ఆకారి సత్యం పోటీపడ్డారు. తన్నీర్ రాజేందర్ సమీప అభ్యర్థి మంద శ్రీనివాస్‌పై 2 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కొత్త మోహన్, కోశాధికారిగా అడువాల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతపండు నర్సింగం, మిట్ట తిరుపతి, చింతపండు శేఖర్, ఆకారి రాజేశం, ఆవుల శ్రీనివాస్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఇక్కడ నేతలు పెంచాల రాజేశం, దీటి శ్రీనివాస్, శ్రీధర్, వేణుగోపాల్ ఉన్నారు.

మద్యానికి బానిసై.. రైలు కిందపడి ఆత్మహత్య

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్30: సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన వెంగళ తిరుపతి(40) పెద్దపల్లిలోని కంచి సారీస్ సెంటర్‌లో సేల్స్‌మెన్‌గా పని చేసేవాడు. అప్పుల బాధతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని మంథని-పెద్దపల్లి రైల్వే ఫ్లైవర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.